క్లుప్తంగా

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుడిపాటిగడ్డలో వెలసిన అయ్యప్పస్వామి దేవస్థానంలో బుధవారం స్వామివారి జన్మ నక్షత్రమైన ఉత్తరానక్షత్రంను పురస్కరించుకుని జన్మదిన వేడుకలు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ తదితర కార్యక్రమాలు చేపట్టి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మహామంగళ హారతులు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు గోపిస్వామి, లక్ష్మయ్య గురుస్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, నాగరాజు, శ్రీకాంత్, వెంకసుబ్బయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



మహిళలను సత్కరించిన న్యాయవాదులు

రుద్రవరం: చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ న్యాయవాదులు శివప్రసాదరావు, రమణయ్య, తిరుపాల్‌రెడ్డి, గాజుల చందన, ప్యానల్ న్యాయవాది సుబ్బయ్య తదితరులు మహిళలకు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వారు మేజర్ పంచాయతీ మాజీ సర్పంచులు నర్సమ్మ, లక్ష్మీదేవితో పాటు మరికొందరు మహిళలను సత్కరించి వారితో కేక్ కట్ చేయించారు. అనంతరం వారు మహిళలకు అవసరమైన చట్టాలపై అవగాహన కల్పించారు.

ఉత్తమ సూపర్‌వైజర్‌గా దస్తగిరమ్మ



జేసీ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న దృశ్యం

శిరివెళ్ల: ఉత్తమ ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్‌గా దస్తగిరమ్మ ఎంపికైంది. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జేసీ నిశాంతి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఎంపీపీ నాయక్ వసీం, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, అధికారులు, అంగన్‌వాడీ వర్కర్లు సూపర్‌వైజర్‌ను అభినందించారు.

భక్తి శ్రద్ధలతో షబ్ ఏ బరాత్

నంద్యాల(వ్యవసాయం): చాబోలులోని జమాలియా మసీదులో మంగళవారం అర్ధరాత్రి షబ్ ఏ బరాత్ నమాజ్ వేడుకలను ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. మసీదు మౌలానా ఇబ్రహీం మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జీవిత ఆశయాలు అందరికీ ఆదర్శనీయమని, ప్రజలందరూ సుఖంగా ఉండాలని ఖురాన్ పఠనం గావించామని చెప్పారు.

రైల్వే ఉద్యోగిని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాగేశ్వరి బాయి

బొమ్మలసత్రం: తన ఆరోగ్యం సరిగాలేదని మెరుగైన పరీక్షల కోసం ఉదయానంద ఆసుపత్రికి పంపాలని కోరినా రైల్వే ఆసుపత్రి వైద్యురాలు పట్టించుకోవటం లేదని రైల్వే ఉద్యోగిని నాగేశ్వరి బాయి బుధవారం ఆసుపత్రి ఎదుట నిరసన వ్యక్తం చేసింది. బాధితురాలు వివరాల మేరకు.. తాను నంద్యాల రైల్వే స్టేషన్‌లో పని చేస్తున్నాని గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో భాధపడుతున్నాని గుండెకు సంబంధించిన పరీక్షల కోసం రైల్వేకు అనుబంధంగా నున్న ఉదయానంద ఆసుపత్రికి పంపాలని కోరినా వైద్యురాలు పట్టించుకోకుండా బయటికి వెళ్లిపొమ్మని చెప్పిందని వాపోయింది. ఈ విషయంపై ఆసుపత్రి వైద్యురాలు జోష్నాను వివరణ కోరగా నాగేశ్వరిబాయికి అన్ని రకాల పరీక్షలు జరిపామని ఆమె ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఆమెపై ఇప్పటికే ఎన్నో అభియోగాలు ఉన్నాయని, తనపై విమర్శలు చేయటం మంచిదికాదన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



ఎమ్మెల్యే శిల్పా రవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సాయిరాం రెడ్డి

నంద్యాల(అర్బన్): క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తే పదవులు అవే వస్తాయని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జోనల్ ఇన్‌చార్జ్‌గా నియమించిన సందర్భంగా సన్నల సాయిరాంరెడ్డి ఎమ్మెల్యే శిల్పా రవి, మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. సాయిరాంరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఉమ్మడి జిల్లా విద్యార్థి విభాగాన్ని అప్పగించిన జిల్లా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శిల్పా రవి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, బీవై రామయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.



రకరకాల తీపి పదార్థాలు వడ్డిస్తున్న దృశ్యం



వివిధ రకాల అన్నం, కూరలు వడ్డిస్తున్న దృశ్యం

కను‘విందు’

- ఆహోబిల బ్రహ్మోత్సవాల్లో స్వామి వారి దర్శనంతో పాటు పసందైన భోజనం
- విందు భోజనం వడ్డిస్తున్న ఓంకార కాశినాయన ఆశ్రమం నిర్వాహకులు
- రోజూ 108 రకాలతో అన్నదానం
- భుక్తాయాసంతో బయటకు వస్తున్న భక్తులు



కూరగాయలు తరుగుతున్న భక్తులు



వంటలు చేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: బ్రహ్మోత్సవాల్లో అహోబిలేశుడిని కనులారా దర్శించుకొని స్వామి వారి రూపాన్ని మనస్సులో నింపుకొని బయటకు వచ్చేవారికి ఓంకార క్షేత్రానికి చెందిన కాశినాయన ఆశ్రమం వారు ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరంలో ఉచితంగా భోజనాలు వడ్డిస్తున్నారు. సాధారణంగా ఉచిత భోజనం అంటే చాలా మంది ఆసక్తి చూపరు. అయితే ఇక్కడ ఏకంగా 108 రకాలతో రోజూ వండి వడ్డిస్తుండటంతో అహోబిలేశుడిని కళ్లల్లో నింపుకొని వచ్చిన వారు ఉచిత భక్ష్య భోజనంతో కడుపు నింపుకొని భుక్తాయాసంతో బయటకు వస్తున్నారు. అక్కడ ఏర్పాటు చేసి వంటకాలను అన్నీ రుచి చూడాలని ఉన్నా సాధ్యం కావడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఉదయం, సాయంత్రం టిఫిన్‌లో భాగంగా ఇడ్లీ, వడ, పూరి, దోశ, ఊతప్పం, కట్లెట్, పానీ పూరీ ఇలా పలు రకాలు అందుబాటులో ఉంటున్నాయి. మధ్యాహ్నం మాత్రం ముద్దపప్పు, సాంబారు, రసం, గుత్తి వంకాయ, ఆలూ కర్రీ, అన్నం, వెజిటబుల్ బిర్యానీ, జీరా రైస్, గోబీ రైస్, కరివేపాకు రైస్.. పాయసం, భక్ష్యం, కర్జికాయ, గారె, చపాతి, పరోటా, రుమాల్ రోటీ.. తదితర వందకు పైగా వంటలు వండి వడ్డిస్తున్నారు. ఇక చివరగా బయటకు వచ్చేటప్పుడు అరటి పండు, తాంబూలం అందజేస్తున్నారు. ఇలాంటి భోజనం ఇంతకు ముందెన్నడూ తినలేదని భక్తులుసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అలిగితివా సఖీ..



స్వామికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

ఆళ్లగడ్డ: శ్రీ ప్రహ్లాదవరదస్వామివారు తన దేవేరులతో జరిపిన ప్రణయ కలహోత్సవం వైభవంగా జరిగింది. శ్రీ అహోబిలేశుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ ప్రహ్లాదవరదుడి ఆలయంలో బుధవారం కలహోత్సవం కనువిందుగా సాగింది. మధ్యాహ్నం శ్రీ ప్రహ్లాదవరదుడు పల్లకీనెక్కి మాడ వీధుల్లోని మార్గంలో దేవాలయం పుష్కరిణి వద్దకు రాగా.. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు చెరో పల్లకిపై వచ్చి స్వామివారికి ఎదురు పడ్డారు. ఎవరికీ చెప్పకుండా రహస్యంగా ఎక్కడికో వెళ్లి వచ్చిన ప్రహ్లాదవరదుడిని చూసిన దేవేరులు ఆగ్రహంతో అలిగి లోపలకు రావద్దంటూ తులుపులు మూయడం, స్వామి భయపడి దాక్కోవడం, మళ్లీ తలుపుల వద్దకు వచ్చి నక్కిచూడటం. వెనక్కి వెళ్లడం ఇలా ఏడు సార్లు బెదిరిన స్వామి.. తానేమీ తప్పుచేయలేదంటూ ఇరువురు భామలను (అమ్మవార్లను)ప్రాధేయపడిన ఘటనలు కళ్లకు కట్టేలా జరిపించారు. చివరకు దేవేరులు శాంతించి ఇరువైపులా చేరి కర్పూర హారతులు ఇవ్వడంతో కలహం వీడి ప్రణయం పండించారు. స్వామి, అమ్మవార్లు ఒకరిపై ఒకరు పూబంతులు విసరడం, స్వామి పుష్పఘాతం నుంచి తప్పించుకోవడం వంటి ఆసక్తికరమైన సన్నివేశాలతో ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుక భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

పైపులైన్ పనుల పరిశీలన

నంద్యాల(సిటీ): పట్టణంలో మంచి నీటి సరఫరా కోసం చేపట్టిన పైప్‌లైన్ పనులను మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు నీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణానికి నీరు సరఫరా చేసే సమ్మర్ స్టోరేజ్, హెడ్ వాటర్ ట్యాంకు వద్ద పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. డీఈఈ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

బైక్ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శ్రీశైలంప్రాజెక్ట్: శిఖరేశ్వరం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన బైక్ ప్రమాదంలో సున్నిపెంటకు చెందిన మల్లికార్జున, బయన్న గాయాలపాలయ్యారు. శిఖరేశ్వరానికి 2 కిమీ దూరంలో బయన్నసెలకు వెళ్లే ప్రాంతంలో ఓవర్‌స్పీడ్‌తో వస్తూ చెట్టును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడ్డవారిని శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందజేస్తున్నారు. మల్లికార్జునకు తీవ్ర గాయాలయ్యాయని మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి



కోటకందుకూరులో అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అభ్యర్థించారు. బుధవారం మండలంలోని కోటకందుకూరు, ఓబుళంపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇళ్ల వద్దకు వెళ్లి కరపత్రాలు అందజేసి మొదటి ప్రాధాన్యత ఓటు వెన్నపూసకు వేయాలని కోరారు. అలాగే ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, నాయకులు డీలర్ రామకృష్ణ, రామ్మోహన్ రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, గంగుల విజయసింహారెడ్డి పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని పార్టీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. బుధవారం మండలంలోని మాయలూరు, హరివరం, తుడుమలదిన్నె గ్రామాల్లో పట్టభద్రుల ఇళ్ల వద్దకెళ్లి ఈ నెల 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును రవీంద్రారెడ్డికి వేయాలని కోరారు.

దొర్నిపాడు: వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ గోపవరం అమర్‌నాథ్‌రెడ్డి, దొర్నిపాడు సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో ప్రచారం నిర్వహించారు. మార్కెట్ యార్డు డైరెక్టర్ భూమా శ్రీనివాసరెడ్డి, నాయకులు జాకీర్‌బాషా, డీలర్ పెద్దన్న, చిన్నమద్దిలేటి, నరేంద్ర, కరీముల్లా, తులసిపెద్దయ్య సచివాలయ కన్వీనర్లు సురేఖ శాంతయ్య, బీఎస్ఎం రఫీ పాల్గొన్నారు.

శిరివెళ్ల: పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ వైఎస్సార్‌సీపీ మండల,గ్రామాల నాయకులు ప్రచారం ముమ్మరం చేశారు. బుధవారం వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, నాయకుడు ఇందూరి ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో మహదేవపురం, బోయలకుంట్ల,గంగవరం, గండంపాడు, మోత్కలపల్లెలో పట్టభద్రుల ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

నంద్యాల: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామసుందర్రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని వాసవీ పాఠశాలలో ఉపాధ్యాయులు, పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించి ముఖ్యమంత్రికి కానుకగా ఇద్దామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్, గురురాజ పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి



ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన దృశ్యం

వైఎస్సార్‌సీపీలో చేరిక

ఆళ్లగడ్డ: మండలంలోని ఓబుళంపల్లి గ్రామానికి చెందిన 50 కుటుంబాలు టీడీపీని వీడి బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అమ్మసాయిబు గారి మాబు, మాబూహుసేన్, లాల్‌సాహెబ్, లాల్ సాహెబ్‌గారి మహ్మద్ హుసేన్, మాబు హుసేన్, హుసన్నగారి మాబాషా, ఆళ్లగడ్డ నడిపెన్న తదితర కుటుంబాలు స్వచ్ఛందగా పార్టీలో చేరుతున్నట్లు ఎమ్మెల్యేతో చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

16,428 మంది ఎమ్మెల్సీ ఓటర్లు

నంద్యాల(అర్బన్): ఈ నెల 13వ తేదీన జరగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నంద్యాల నియోజకవర్గంలో 16,428 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని నంద్యాల తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం వార్డుల వారీగా ఓటరు స్లిప్పులను పోలింగ్ సిబ్బంది తయారు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నంద్యాల అర్బన్ ప్రాంతంలో ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటర్లకు సంబంధించి 13, గ్రామీణ ప్రాంతాల్లో 2, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లకు 2, గోస్పాడులో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లకు 1, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లకు 1 కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు.

పారిశ్రామిక విప్లవానికి నాంది పలికిన సీఎం జగన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

నంద్యాల: విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ కార్యక్రమానికి దేశంలోనే దిగ్గజ పారిశ్రామిక వేత్తలను రప్పించి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడుల ఒప్పందం కుదిర్చి పారిశ్రామిక విప్లవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని, ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని శిల్పా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.13లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తెప్పించి ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తానని, ఊకదంపుడు ప్రసంగాలు చేసి చివరకు రూ.39 వేల కోట్లు ఒప్పందాలు జరిగాయని చెప్పి అందులో సగం కూడా తీసుకు రాలేకపోయారన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన అన్ని రకాల బకాయిలను నెలాఖరు లోపు చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, మహానంది దేవస్థానం చైర్మన్ మహేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ నాగభూపాల్‌రెడ్డి, పార్టీ బండిఆత్మకూరు మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా తీర్థవారి చక్రస్నానం

- వైభవంగా ద్వాదశారాధనం
- కనుల పండువగా పుష్పయాగం



స్వామికి చక్రస్నానం చేయిస్తున్న ప్రధానార్చకులు



పుష్పయాగం నిర్వహిస్తున్న పీఠాధిపతి, అర్చకులు



దిగువ అహోబిలంలో క్యూలైన్లలో పోటెత్తిన భక్తులు

ఆళ్లగడ్డ: బ్రహ్మోత్సవ వేడుకల్లో చివరి రోజైన బుధవారం గ్రామోత్సవాలు, ఆధ్యాత్మిక ఘట్టాలు భక్తులను అలరించాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా దిగువ అహోబిలంలో ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా తీర్థవారి చక్రస్నానం నిర్వహించారు. ఉదయం ఉత్సవమూర్తులు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను ప్రత్యేకంగా అలంకరించి కోనేరు వరకు ఊరేగింపుగా తోడ్కొని వచ్చారు. అక్కడ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం వస్త్రాలు మార్చి ప్రధానార్చకులు శ్రీమాన్ శఠకోప వేణుగోపాలన్ ఆధ్వర్యంలో సుదర్శనమూర్తి, నిత్య అభిషేక ఉత్సవమూర్తికి కోనేరులో శాస్త్రోక్తంగా తీర్థవారి చక్రస్నానం చేయించారు.

శాస్త్రోక్తంగా ద్వాదశ ఆరాధనం..

మధ్యాహ్నం ద్వాదశ ఆరాధనం పండితులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామికి ఆరాధన దోషాలను నివృతి చేసుకోవడం కోసం 12 మార్లు తిరువారాధన చేసి 12 రకాల భక్ష్యాలను 12 రకాల అన్నంతో నివేదించారు.

పూలు పరిమళించే..

రాత్రి ఉత్సమూర్తులను యాగశాలలో కొలువుంచి ముందుగా అభిషేకం, అర్చనలు నవకళశ స్నపన తిరుమంజనం జరి పించారు. అనంతరం విశేషాలంకరణ గావించి దేశంలోని వివిధ ప్రదేశాల నుంచి తెప్పించిన 108 రకాల పూలు, పత్రాలతో అలకంరించిన యాగశాలలో కొలువుంచారు. అనంతరం విడిపూలతో స్వామి, అమ్మవార్ల పాదాల నుంచి హృదయం మునిగేంత వరకు పుష్పారాధన గావించారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఆర్ఏఆర్ఎస్‌లో శాస్త్రవేత్తను సన్మానిస్తున్న దృశ్యం



ఆర్టీసీ మహిళా కండక్టర్లను సన్మానిస్తున్న దృశ్యం



శిల్పానాగిని రెడ్డిని సన్మానిస్తున్న నందిరైతు సమాఖ్య సభ్యులు



పేద మహిళలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేసిన జడ్జి రాధారాణి

నంద్యాల(అర్బన్),(వ్యవసాయం),(సిటీ), రూరల్: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంతో పాటు రూరల్ ప్రాంతాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల ప్రసంగాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

- పట్టణంలోని ఆర్ఏఆర్ఎస్‌లో జరిగిన వేడుకల్లో ఏడీఆర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పరిశోధన స్థానం కీర్తిని ముందుకు తీసుకెళ్తున్న శాస్త్రవేత్త జయలక్ష్మిని ఘనంగా సన్మానించారు. పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.
- మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మున్సిపల్‌కమిషనర్ రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండి సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, మెప్మా సీఎంఎం విజయభాస్కర్‌రెడ్డి, పొదుపు మహిళలు పాల్గొన్నారు.
- ఎస్పీజీ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ స్వరూపరాణితో పాటు పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.
- దళిత సంఘాల ఆధ్వర్యంలో స్టార్ సొసైటీ నిర్వాహకురాలు రాజేశ్వరమ్మతో పాటు పలువురు మహిళలను నాయకులు రాజు, సంపత్‌కుమార్, సుబ్బరాయుడు, చార్లెస్ తదితరులు సన్మానించారు.
- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సాంబశివుడు పలువురు మహిళలను సన్మానించారు. రోజక్క, వేణుగోపాల్ నాయుడు, రమణ పాల్గొన్నారు.
- స్థానిక నరసింహయ్య భవన్‌లో జరిగిన వేడుకల్లో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు నిర్మల, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్‌లు పాల్గొని మహిళల హక్కులను వివరించారు.
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ నాగరాణిని ఏపీజీఈఏ నంద్యాల జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ గిరిశివ శంకర్‌రెడ్డి, వైద్య సిబ్బంది సన్మానించారు.
- నంద్యాల ఆర్టీసీ గ్యారేజ్ ఆవరణలో జిల్లాలోని 8 మంది ఉత్తమ మహిళా కండక్టర్లకు జిల్లా ప్రజారవాణాధికారి శ్రీనివాసులు సత్కరించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ సునీత, గడివేముల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శైలజ పాల్గొన్నారు.
- నంది రైతు సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక శ్రీశైల పబ్లిక్ స్కూల్‌లో మహిళావికాసం–సమాజ ప్రగతి అనే అంశం పై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సతీమణి శిల్పా నాగినిరెడ్డి పాల్గొన్నారు. విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్, వెంకటరమణమ్మ, డాక్టర్ సునీత, విజయరాణి, కోటేశ్వర సునీత పాల్గొన్నారు.
- శ్రీ చైతన్య కళాభారతి అధ్యక్షుడు విజయభాస్కర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి, శిల్పా నాగినిరెడ్డి, న్యాయవాది శ్రీదేవి పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం పేద మహిళలకు దుప్పట్లు, చీరలు, దోమతెరలు పంపిణీ చేశారు.
- బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా న్యాయవాదులు శ్రీదేవి, లీలావతి, నిర్మల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ అర్చన పాల్గొన్నారు. అనంతరం జడ్జీలు, మహిళాన్యాయవాదులను బార్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు.

గోస్పాడు: సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగపు జిల్లా అధ్యక్షురాలు, గ్రామ ఉపసర్పంచ్ శకుంతలమ్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా యాల్లూరు గ్రామంలోని అరవింద ఆశ్రమంలో బుధవారం మహిళలతో సమావేశం నిర్వహించారు. అనంతరం పలువురు వృద్ధులను సన్మానించారు.

ఆళ్లగడ్డ: మహిళలు హక్కులపై పూర్తి అవగాహన పెంచుకోవాలని మహిళా న్యాయవాది సరిత తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం సమావేశ భవనములో సమావేశం ఏర్పాటు చేశారు. మున్సిపల్ మహిళా కౌన్సిలర్లు, మెప్మా లీడర్లు పాల్గొన్నారు. చాగలమర్రి 17వ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త చంద్రకళ బుధవారం ఉత్తమ అంగన్‌వాడీ కార్యకర్తగా జేసీ నిశాంతి ప్రశంసా పత్రం అందుకున్నారు.